రెండు నెలలకోసారి ప్రాజెక్టులపై సమీక్ష

పాలమూరు సాగునీటి పథకాలకు ప్రాధాన్యం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నాగర్‌కర్నూల్ : సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన నీటిపారుదల శాఖ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న నీటపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

ఈనాడు, మహబూబ్‌నగర్-న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్: పాలమూరు ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నామని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎత్తిపోతల పథకాల పరిధిలో ఎక్కడెక్కడ నిధులు మంజూరు చేయాలో నివేదికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రెండు నెలలకోసారి పాలమూరు ప్రాజెక్టులపై సమీక్షలు చేపడతామన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులను బుధవారం ఆయన మంత్రి జూపల్లి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సందర్శించారు. ఉత్తమ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఇక్కడి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ భూసేకరణ సమస్యలతో పనులు ఆలస్యం అవుతున్నాయని గుర్తించామన్నారు. దీనిపై గురువారం లోగా సమగ్ర సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఉదండాపూర్‌లో భూ సేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రావాల్సిన నిధులు ఆరు నెలల్లో చెల్లిస్తామన్నారు. గద్వాల నియోజకవర్గంలో 20 టీఎంసీల నీరు నిల్వ చేసేలా జలాశయాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నార్లాపూర్ వద్ద పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. జలాశయాల సందర్శన వద్ద అక్కడి సమస్యల్ని ప్రస్తావిస్తూ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ పథకాల ఉద్దేశం, వాటి పూర్తి వివరాలపై ప్రాజెక్టు అధికారులను ప్రశ్నించగా కొన్ని చోట్ల అధికారులు తడబాటుకు గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని ఈ పథకాలను వివరించారు.

వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలంటూ ఆందోళన.. : ఉదండాపూర్ జలాశయం పర్యటన ముగించుకుని వెళ్తుండగా ముంపు గ్రామాలకు చెందిన కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమకు వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రూ.25 లక్షలు ఇస్తామని చెప్పి.. రాత్రికి రాత్రి రూ.16 లక్షలే ఖాతాలో ఎలా జమ చేస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, తమకు న్యాయం జరగకుంటే జలాశయం పనులను అడ్డుకుంటామని తెలిపారు. ఓ దశలో తోపులాట జరిగింది. పోలీసులు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ మల్లు రవి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, స్పెషల్ చీఫ్‌సెక్రటరీ రామకృష్ణరావు, ఈఎన్‌సీ అనిల్, కలెక్టర్లు సంతోష్, విజయేందిర బోయి, నీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు వివరించిన ఎమ్మెల్యేలు..: సమీక్షలో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ నార్లాపూర్, ఏదుల మధ్యలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని జలాశయాల వద్ద ఒక్కో పంపునైనా సిద్ధం చేసి నీరు ఎత్తిపోసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

- ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉదండాపూర్.. ప్రాజెక్టుకు గుండెకాయలాంటిదన్నారు.
- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో 8 గ్రామాల ప్రజలకు నీటి ఊటతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ కింద పరిహారం ఇప్పించాలన్నారు.
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కేఎల్ఐ కాలువ 10 చోట్ల తెగిపోయి పంట పొలాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు.
- ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేయించాలన్నారు. కేఎల్ఐ 29 ప్యాకేజీలో వంగూరు మండలంలోని 8 గ్రామాలకు నీళ్లు ఇవ్వాలని కోరారు.
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ వట్టెం జలాశయం కింద డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయకట్టును పెంచాలని కోరారు.
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ నెట్టెంపాడు కింద 99వ ప్యాకేజీలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు.
- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ హాజిలాపూర్, చౌదరపల్లి ఎత్తిపోతల పనులను చేపట్టాలని కోరారు.


20 శాతం కూడా చేయలేదు: జూపల్లి

సమీక్షలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ భారాసకు చెందిన మాజీ మంత్రి ఒకరు వారి హయాంలో 90 శాతం పనులు పూర్తి చేసినట్లుగా చెబుతున్నారని, ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. పాలమూరు జిల్లాలో కుర్చీ వేసుకుని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని కేసీఆర్ చెప్పారన్నారు. ఇప్పటికీ 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. కాలువలు పూర్తి కాకుండా ఆయకట్టుకు నీరెలా ఇస్తారని ప్రశ్నించారు. నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదన్నారు. సక్రమంగా పని చేయకపోవడం వల్లే ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే స్థానాలకు భారాస రెండు సీట్లకే పరిమితమైందన్నారు.


నాగర్‌కర్నూల్: సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మేఘారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, నారాయణరెడ్డి, వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, విజయుడు, మధుసూదన్‌రెడ్డి

డ్రాప్‌బాక్స్‌లో 13,338 మంది విద్యార్థులు

సరి చేయడంలో నిర్లక్ష్యంతో ఇబ్బందులు


నాగర్‌కర్నూల్ : కొల్లాపూర్ కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులు

కందనూలు, న్యూస్‌టుడే

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలు, పాఠశాలలకు సంబంధించిన వివిధ రకాల గణాంకాలు పక్కాగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్‌ను అమలు చేస్తోంది. అంతర్జాలంలో విద్యార్థుల వివరాలతో పాటు పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. యూడైస్ ప్లస్‌లోని డ్రాప్ బాక్సుల్లో విద్యార్థుల వివరాలు సరి చేయడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల ప్రారంభమై దాదాపు నాలుగు నెలలు కావస్తోంది. విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు నమోదు చేసుకోవడం, పాఠశాలలు మారిన విద్యార్థులకు బదిలీ ధ్రువపత్రం (టీసీ) జారీ చేయడం పూర్తయింది. ప్రతి విద్యార్థికి క్రమసంఖ్య కేటాయించి ఆన్‌లైన్ ద్వారా టీసీలు ఇవ్వడం వలన పాఠశాలలు మారిన వారి వివరాలు యూడైస్ ప్లస్ అంతర్జాలంలోని డ్రాప్ బాక్సుల్లో కన్పిస్తాయి. విద్యార్థి మరో పాఠశాలలో చేరిన వెంటనే సంబంధిత నిర్వాహకులు వివరాలను డ్రాప్ బాక్సుల్లో నుంచి తీసుకోవాలి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల ప్రవేశాలు నమోదు చేసుకుంటున్నారు తప్పా డ్రాప్ బాక్సుల్లో నుంచి వివరాలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు	1,031
మొత్తం విద్యార్థులు	1,17,921

తరగతుల వారీగా..

నర్సరీ (169), ఎల్‌కేజీ (180), యూకేజీ (4), 1వ తరగతి (397), 2వ (687), 3వ (557), 4వ (547), 5వ (758), 6వ (984), 7వ (455), 8వ (588), 9వ (448), 10వ (649), 11వ (5,518), 12వ (1,397)

ఎక్కడా చేరనట్టే..

విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వలన జిల్లాలో ప్రస్తుతం 13,338 మంది విద్యార్థులు డ్రాప్ బాక్సుల్లోనే ఉండిపోయారు. ప్రధానోపాధ్యాయులు వివరాలు సరి చేయకపోవడం వలన టీసీలు పొంది వేరే పాఠశాలలో ప్రవేశాలు నమోదు చేసుకున్నా.. అంతర్జాలంలో మాత్రం ఏ పాఠశాలలోనూ చేరనట్లే ఉంటుంది. ఈ విధానం వలన విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదేశాలు జారీ చేశాం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డ్రాప్ బాక్స్‌లోని వివరాలను సరి చేయాలని ఆదేశాలు జారీ చేశాం. సెప్టెంబర్ చివరిలోపు మొత్తం సరి చేసేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఇబ్బందులు కల్గకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

- గోవిందరాజులు, జిల్లా విద్యాశాఖ అధికారి

తీరంలో భూమాయ


కృష్ణ మండలం ముడుమాల్‌దొడ్డి శివారులో సర్వే నెం.45లో ప్రభుత్వ భూమి

కృష్ణా, మాగనూరు మండలాల్లో గతంలో విడతలవారీగా బడుగువర్గాలకు 2140 ఎకరాల భూమి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా కేటాయించారు. పట్టాలిచ్చారు. కొందరికి పాసు పుస్తకాలున్నాయి. కానీ భూమి ఎక్కడుందో హద్దులేమిటో ఇప్పటికీ తెలియదు. చేతులు మారిందేమోనన్న అనుమానం రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

న్యూస్‌టుడే, కృష్ణా

గతంలో నిరుపేద రైతులకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మంజూరుచేసిన భూములు అధికారుల సంతకాలకే పరిమితమయ్యాయి. ఒక్కొక్క రైతుకు అప్పట్లో మూడు నుంచి ఐదెకరాల భూమి కేటాయించి పట్టాలు ఇచ్చారు. ఆ లాంఛనం రైతులకు ఇప్పటి వరకూ తమ పేరిట ఉన్న భూమి ఎక్కడన్నది చూపించలేదు. గతంలో పట్టాలు తీసుకున్న వారిలో కొందరు కాస్తుల్లో ఉన్నారు. ధరణి వచ్చాక వారి పేరిట ఉన్న పట్టాలను నిలిపి వేశారు. వారికి అందాల్సిన రైతు బంధు నిలిపివేశారు. వారంతా ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మాగనూరు, నేరేడ్‌గం, ఆలంపల్లి, అడవిఖానాపూర్, ముడుమాల్, వడ్వాట్, అయినాపూర్ గ్రామాలలో అసైన్‌మెంట్ ద్వారా ఇచ్చిన భూముల వివరాలు మొత్తం గందరగోళంగా ఉన్నాయి. సరిదిద్దాల్సిన అధికారులు సర్వేయర్లపైకి నెపంనెట్టి కాలం గడుపుతున్నారు. వందల ఎకరాల అసైన్‌మెంట్ భూమి ప్రశ్నార్థకంగా మారింది. ఆలంపల్లి శివారులోని 302, 305, 306 సర్వే నంబర్లలో అప్పటి రైతుల పేర్లు ఇప్పుడు లేవు. వారెవ్వరో వివరాలు చెప్పాలని పలువురు కోరుతున్నారు.


పట్టాలకు పట్టుగా సమస్య : 1972 నుంచి 2006 వరకు అసైన్‌మెంట్ భూ పంపిణీ జరిగింది. నేటి వరకూ కొందరు మాత్రమే లబ్ధి పొందారు. చాలా మంది పేర్లు అసైన్‌మెంట్ కమిటీలో ఉన్నా ఇప్పుడు వారి పేర్లపై భూములు లేవు. ఒకటీ అరా తప్ప మిగతావి అన్యాక్రాంతమైపోయాయి. కృష్ణా తీరంలో బడుగువర్గాలకు ఇచ్చిన భూములు చాలావరకు వేరే వర్గాల పేరుపై రిజిస్ట్రేషన్ కావడంలో మతలబు ఏమిటో అర్థం కావడం లేదు.

అర్జీ ఇస్తే పక్కకే : అసైన్‌మెంట్ భూముల విషయంలో వస్తున్న అర్జీలను సర్వే పేరుతో పక్కకు పెడుతున్నారు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత మొత్తం అసైన్డ్ భూమిని నిషేధిత జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి వివరాలు బయటకు వెల్లడించడం లేదు. పలు గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులను బుట్ట దాఖలు చేస్తున్నారు. ప్రజావాణిలో కలెక్టరుకు వరుసగా ఫిర్యాదులు చేస్తున్నా అదే పరిస్థితి ఉంది.

ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలోకి..: అప్పట్లో ప్రభుత్వ ఆదేశాల మేరకే నిషేధిత భూముల జాబితాలో చేర్చాం. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సంక్రమించిన భూములకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తాం. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయితే తదుపరి చర్యలు చేపడతాం.
- సురేశ్, తహసీల్దారు, మాగనూరు.


మా నాన్నకు ప్రభుత్వ భూమి ఐదెకరాలు సంక్రమించింది. ఇద్దరు అన్నదమ్ములు సమానంగా పంచుకుని సాగు చేసుకున్నాం. భారాస హయాంలో పట్టాలు రద్దు చేశారు. నేటికీ అదే పొలంలో పంటలు వేసుకుంటున్నాం. మాకు అన్యాయం చేయవద్దు.
- సాధు నర్సప్ప, గురురావు లింగంపల్లి


మూడు దశాబ్దాల క్రితం గుడేబల్లూర్ శివారులో భూమికి పట్టా పాసుపుస్తకం ఇచ్చారు. బ్యాంకులో రుణం తీసుకున్నాం. రైతుబంధు వచ్చింది. మా భూమి ఎక్కడుందో అడిగితే మాత్రం చెప్పడం లేదు.
- వంద్రపోళ్ల శివప్ప, గుడేబల్లూర్


నా భార్య ఉమాదేవి పేరిట అయినాపూర్ శివారులో మూడెకరాల భూమి పట్టా ఇచ్చారు. నాటి నుంచి నేటి వరకూ మాకు ఇచ్చిన భూమి ఎక్కడ ఉందని అడిగితే అధికారులు సమాధానం చెప్పడం లేదు. పేరుకే పట్టాలు ఇచ్చి రికార్డులలో పేర్లు తారుమారు చేశారేమో అనుమానం కలుగుతోంది.
- గుండప్ప సవకార్, గుడెబల్లూర్.

లోక్‌అదాలత్‌తో డబ్బు, సమయం ఆదా

జిల్లా కోర్టు న్యాయమూర్తి రాజేశ్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోర్టు న్యాయమూర్తి రాజేశ్‌బాబు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు, న్యాయవాదులు చొరవ చూపాలని, బాధితులకు ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా కేసులు పరిష్కృతమవుతాయని, డబ్బు, సమయం ఆదా అవుతాయని జిల్లా కోర్టు న్యాయమూర్తి రాజేశ్ బాబు అన్నారు. బుధవారం కల్వకుర్తి కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కావ్య ఆధ్వర్యంలో జరిగిన లోక్‌అదాలత్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. క్రిమినల్ కేసులు తగ్గాయని సివిల్ కేసులు మాత్రం పెరుగుతున్నందున కక్షిదారులకు రాజీ కుదిర్చేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కోర్టు ఏర్పడ్డాక ఇప్పటి వరకు ఆరుసార్లు మెగా లోక్‌అదాలత్ నిర్వహించగా 56,452 కేసులు పరిష్కరించామన్నారు. అనంతరం నూతన కోర్టు భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ స్థలంలో ఉన్న చెట్ల తొలగింపు అంశాన్ని అటవీశాఖ అధికారులతో చర్చించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో డీసీసీ వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట రమణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా సేవలో భాగస్వాములు కావాలి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : స్వచ్ఛభారత్ లక్ష్యంగా నవంబరు 1 వరకు నిర్వహించే స్వచ్ఛత హీ సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు అన్నారు. బుధవారం కల్వకుర్తి కోర్టు ఆవరణలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొన్నారు. పుర సిబ్బందితో కలిసి కోర్టు ఆవరణలో శుభ్రం చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి కోర్టు న్యాయమూర్తులు శ్రీదేవి, కావ్య, బార్ అసోసియేషన్ సభ్యులు, పుర పర్యావరణ ఇంజినీర్ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుల సేవలు విలువైనవి


నాగర్‌కర్నూల్ : కేకు కోస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. స్వరాజ్యలక్ష్మి

కందనూలు, న్యూస్‌టుడే : రోగులకు వైద్య సేవలు అందించడంలో ఫార్మాసిస్టుల సేవలు విలువైనవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. స్వరాజ్యలక్ష్మి తెలిపారు. పట్టణంలోని కలెక్టరేట్ సముదాయంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఫార్మాసిస్టు దినోత్సవంలో డీఎంహెచ్‌వో పాల్గొని కేకు కోశారు. రోగులు మందులు వినియోగించే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డా. వెంకట్‌దాస్, ప్రోగ్రామ్ అధికారులు డా. రవి కుమార్, డా. శ్రీనివాసులు, డా. లక్ష్మణ్, డా. కృష్ణమోహన్ పాల్గొన్నారు.

జూరాలకు పెరుగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద పెరుగుతోంది. జలాశయంలోకి బుధవారం సాయంత్రానికి 71 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. 7 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా 88 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జూరాలకు వరద మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో దిగువకు నీటి విడుదల పెంచినట్లు అధికారులు తెలిపారు. అటు కర్ణాటక ప్రాజెక్టులకు సైతం వరద స్వల్పంగా పెరిగినట్లు సమాచారం.

విద్యాలయాలకు నిర్వహణ నిధులు

ఉమ్మడి జిల్లాకు రూ. 9.53 కోట్లు ● తొలి విడత 50 శాతం నిధులు విడుదల


కొండనాగుల జడ్పీ ఉన్నత పాఠశాలలోని శౌచాలయాలు

పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో హెచ్ఎంలు సొంతంగా ఖర్చు చేసేందుకు ఇబ్బంది పడ్డారు. మొదటి విడతగా 50 శాతం నిధులు విడుదల కావడంతో కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకు హెచ్ఎంలు సొంతంగా ఖర్చు చేసిన నిధులను ఏఏపీసీ కమిటీల తీర్మానంతో మినహాయించుకోవడానికి అవకాశం కల్పించారు. త్వరలో రెండో విడత మరో 50 శాతం నిధులు విడుదల చేయనుండటంతో పాఠశాలల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవడానికి వెసులుబాటు ఏర్పడింది.

- న్యూస్‌టుడే, అచ్చంపేట

సర్కారు బడుల్లో నిర్వహణ కోసం 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమైన మూడు నెలల తరువాత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కనీస అవసరాలైన సుద్ద ముక్కలు, రిజిస్టర్లు, హాజరు పట్టికలు, స్టేషనరీ, చార్టులు, పరీక్షల నిర్వహణ, కంప్యూటర్ సామగ్రి, శౌచాలయాల నిర్వహణ, తాగునీరు, మరమ్మతు పనులు, ఇంటర్నెట్, ప్రయోగశాలల పరికరాలు, రసాయన సామగ్రి, జాతీయ పండుగల నిర్వహణ, డస్టర్లు, చీపుర్లు, బకెట్లు, బిందెలు, సబ్బులు తదితర వస్తువులను కొనుగోలు చేసేందుకు ఏటా సర్కారు నిధులు కేటాయిస్తోంది. గతంలో ఈ నిధుల నుంచే విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించేవారు. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉచిత విద్యుత్తును అందిస్తుండటంతో కొంత భారం తగ్గింది. నిధుల విడుదలలో జాప్యంతో హెచ్ఎంలు సొంత నిధులు పెట్టి అవసరమైన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వెసులుబాటు కలగనుంది. పాఠశాలల నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లాలోని 3,032 పాఠశాలలకు మొత్తం రూ. 9.53 కోట్లు మంజూరు చేసింది. మొదటి విడతగా అందులో 50 శాతం నిధులు రూ. 4.76 కోట్లు విడుదల చేశారు.

- ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీ, ఆదర్శ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించారు. ఈ నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ) తీర్మానంతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది.
- డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూల్

ఉమ్మడి జిల్లాకు నిధుల మంజూరు (రూ.లలో)

జిల్లా	పాఠశాలలు	మంజూరు	విడుదల
జోగులాంబ గద్వాల	447	1,75,80,000	87,90,000
మహబూబ్‌నగర్	795	2,33,35,000	1,16,67,500
నాగర్‌కర్నూల్	834	2,26,05,000	1,13,02,500
నారాయణపేట	460	1,68,75,000	84,37,500
వనపర్తి	496	1,49,50,000	74,75,000
మొత్తం	3,032	9,53,45,000	4,76,72,500

కేటాయింపు ఇలా..

విద్యార్థుల సంఖ్య	నిధులు (రూ.లలో)
1–30	10,000
31–100	25,000
101–250	50,000
251–1000	75,000
1000 పైగా	1,00,000

విద్యార్థులకు సైన్స్ డ్రామా పోటీలు

అచ్చంపేట, న్యూస్‌టుడే : సైన్స్ డ్రామా ఫెస్టివల్ జిల్లా స్థాయి పోటీలను అక్టోబరు 1న జిల్లా కేంద్రంలోని జాతీయోన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని డీఈవో డా.గోవిందరాజులు తెలిపారు. ఎంపిక చేసిన అంశాల్లో ఏదైనా ఒక దాంట్లో 30 నిమిషాల వ్యవధిలో విద్యార్థులు డ్రామా రూపంలో ప్రదర్శన ఇవ్వాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

వట్టెం పంపుహౌస్‌లో తేలిన మోటార్లు



వట్టెం పంపుహౌస్ ఇదే..

నీటి తిరిగి ఎత్తిపోత

నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, న్యూస్‌టుడే : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం జలాశయం వద్ద చేపట్టిన పంపుహౌస్‌లో మునిగిన మోటార్లు బుధవారం తేలాయి. ఈనెల 2న వచ్చిన భారీ వర్షాలకు శ్రీపురం, ఉయ్యాలవాడ, కుమ్మెర గ్రామాల వద్ద ఉన్న ఆడిట్ టన్నెళ్ల ద్వారా నీరు లోపలికి వెళ్లాయి. పంపు హౌస్‌లోని మోటార్లు పూర్తిగా మునిగిపోయాయి. 20 మీటర్ల వరకు నీరు నిల్వగా మారింది. శ్రీపురం నుంచి వట్టెం వద్ద ఉన్న పంపు హౌస్ వరకు ఉన్న టన్నెల్ పూర్తిగా నీటిలో ఉంది. మోటార్లు మునిగిన తర్వాత ఈ 4వ తేదీ నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడివేసే పనులను చేపట్టారు. ముందుగా మోటార్లను బయటికి తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 40 మోటార్ల ద్వారా నిత్యం నీటిని తోడివేస్తున్నారు. వారం రోజులుగా సర్జిపుల్ నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు వెళ్లకుండా షట్టర్ల మూసివేత పనులు చేపట్టారు. ఆరుగురు గజ ఈతగాళ్లను పిలిపించి షట్టర్లలో నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు రాకుండా చర్యలు చేపట్టారు. బుధవారం మోటార్లు తేలాయి. 15 కిలో మీటర్ల పొడవునా ఉన్న టన్నెల్‌లో మాత్రం నీళ్లు అలాగే ఉన్నాయి. పంపుహౌస్‌లో ఉన్న నీటిని ఐదు హెచ్‌పీ మోటార్ల ద్వారా తోడివేశామని, మోటార్లకు మరమ్మతులు చేస్తున్నట్లు ఈఈ పార్థసారథి తెలిపారు.



మోటారు భాగాలు విడదీసి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

9 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం నుంచి వరద నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి చేపట్టేందుకు జెన్‌కో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. గడచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.017, దిగువన నాలుగు యూనిట్ల ద్వారా 2.910 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఉత్పత్తి ఎగువన 193.074, దిగువన 167.034 మిలియన్ యూనిట్లకు చేరిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

అమ్మాయిలు తగ్గిపోతున్నారు..!



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జన్మించిన నవజాత శిశువులు

పాలమూరు, న్యూస్‌టుడే

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూడేళ్లలో నమోదైన జననాల రేటులో అబ్బాయిల కంటే అమ్మాయిల సంఖ్య తక్కువగా నమోదైంది. వీరిపై చిన్న చూపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పల్లెల్లో, తండాల్లో మగపిల్లలు పుట్టాలని కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇంటి బాధ్యతలు మోస్తాడని.. తల్లిదండ్రులకు ఆధారంగా ఉంటాడని.. వంశాన్ని నిలబెడతాడని.. కొందరు పాత పోకడలను పట్టుకుని వాటిని పాటిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఆడపిల్లలపై వివక్ష కొనసాగించడం ఆందోళనను కలిగిస్తోంది. అబ్బాయిలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించి అమ్మాయిలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేవారున్నారు. ఇద్దరూ సమానమని అవగాహన కల్పిస్తున్నా మార్పు రావడం లేదు.

విచ్చలవిడిగా స్కానింగ్ కేంద్రాలు

భ్రూణ హత్యలు చేయడం నేరం. గుట్టుచప్పుడు కాకుండా గర్భవిచ్ఛిత్తి చేస్తున్నారు. మూడు నెలల క్రితం భూత్పూర్ సమీపంలో ఓ ఆర్ఎంపీ పర్యవేక్షణలో వివాహితకు గర్భవిచ్ఛిత్తి వైద్యం వికటించి ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే.



ఇలాంటి నేరాలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. వెలుగులోకి రానివి ఉమ్మడి జిల్లాలో చాలా ఉంటాయి. పట్టణాలు, మండల కేంద్రాల్లో స్కానింగ్ కేంద్రాలు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయి. ఇక్కడి వచ్చే గర్భిణుల పేర్లు నమోదు చేసుకొని, ఆధార్‌కార్డు వివరాలు రికార్డుల్లో రాయాలి. పూర్తి సమాచారం వారి వద్ద ఉండాలి. కొందరు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు పేర్లు చేసుకుంటున్నారు. పుట్టబోయేది ఆడ లేదా మగ వివరాలు కూడా చెబుతున్నారు. ఈ కేంద్రాలపై వైద్య, ఆరోగ్య శాఖాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

ఉమ్మడి జిల్లాలో నమోదైన బాలుర, బాలికల జననాల వివరాలు..

(అబ్బాయిలు / అమ్మాయిలు)

జిల్లా	2021-2022 అబ్బాయిలు	2021-2022 అమ్మాయిలు	2022-2023 అబ్బాయిలు	2022-2023 అమ్మాయిలు	2023-2024 అబ్బాయిలు	2023-2024 అమ్మాయిలు
మహబూబ్‌నగర్	8,099	7,577	7,958	7,406	7,617	6,979
నాగర్‌కర్నూల్	6,680	6,062	6,742	6,782	6,639	5,913
వనపర్తి	4,710	4,346	4,606	4,393	4,647	4,030
జోగులాంబ గద్వాల	5,007	4,732	4,984	4,625	4,773	4,268
నారాయణపేట	5,258	4,956	5,234	4,831	5,215	4,637

తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం



మా వద్దకు వచ్చే తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. గర్భం దాల్చిన తరువాత మంచి ఆహారం తీసుకోవాలని చెబుతున్నాం. సమాజంలో అమ్మాయిలు.. అబ్బాయిలతో సమానమనే భావన తల్లిదండ్రుల్లో కలగాలి. సాధారణంగానే బాలికల శాతాన్ని పెంచాలి. లింగనిర్ధారణ పరీక్షలపై నియంత్రణ ఉండాలి. చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి. అమ్మాయిలకు మంచి భవిష్యత్తు ఉంటుంది. వారి కోసం అనేక సంక్షేమ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి.

- డా.సంగీత షా, ప్రసూతి విభాగాధిపతి, మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నాం



సమాజంలో బాలికలు, బాలురు అనే తేడా లేకుండా ఉండటానికి వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఎక్కడ కూడా భ్రూణ హత్యలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తున్నాం. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లో వాటి వివరాలు బహిర్గతం చేయరాదు. నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం.

- పద్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, మహబూబ్‌నగర్

అక్షరాలు.. ఆకలి తీర్చే ఔషధాలు



మాట్లాడుతున్న గేయ రచయిత అందెశ్రీ

పాన్‌గల్, న్యూస్‌టుడే : అక్షరాలు ఆకలి తీర్చే ఔషధం కావాలని గేయ రచయిత, లోక కవి అందెశ్రీ అన్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఆ పాఠశాల ఉపాధ్యాయుడు, పుస్తక సంపాదకుడు సి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఫ్లయింగ్‌బర్డ్స్' విద్యార్థుల కవితా సంకలనం పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి అందెశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి ఎదుర్కొనే ఆకలి, ఆశ, కోరికలకు పరిష్కారం అక్షరమే అన్నారు. 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' అన్న గేయం తెలంగాణ ఉద్యమ సమయంలో, నేడు రాష్ట్ర గేయంగా మారినా దానిని నిలబెట్టింది, గుర్తింపునిచ్చింది, బతికించింది పిల్లలేనని గుర్తు చేశారు. తాను నిరక్షరాస్యుడైనా చందస్సు రాసి, ఎవరైనా ఎలాంటి పరిస్థితుల్లోనైనా దృఢంగా విశ్వసిస్తే ఎంతటి శిఖరాలకైనా చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థి దశలోనే ఇంత గొప్ప కవిత్వం రాసిన బాలలు రాబోయే రోజుల్లో తమ సాహితీ ప్రక్రియ ద్వారా సమాజంలో ఉన్నత మార్పులు తీసుకురావడానికి తమను తాము గొప్పగా మలుచుకోవాలని సూచించారు. చదువు లేని వ్యక్తి ఏదైనా తప్పు చేయాలంటే ఆలోచిస్తాడని, అదే చదువుకున్న వ్యక్తి ఆలోచించకుండా తప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాలాన్ని అవసరాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. అంతర్జాలం కంటే మన మేధస్సు ఎంతో గొప్పదని, అంతర్జాలం కారణంగా అన్ని మర్చిపోతున్నామని ఆందోళన చెందారు. కులమతాలను పక్కన బెట్టి బోధించాలని ఉపాధ్యాయులను సూచించారు. రాష్ట్ర మంత్రుల కార్యాలయాలకు తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కష్ణారావును కోరారు. పాఠశాల ఆవరణలో నీటి తడిలో కూర్చొని విద్యార్థులు కార్యక్రమం చూస్తుంటే ఆయన పైవిధంగా స్పందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు నరేందర్, మంజుల, ప్రజాకవి జనజ్వాల, గాయకుడు సత్తార్, ఎంపీడీవో గోవిందరావు, ఎంపీవో రఘురాములు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 తరగతులు.. 12 మంది విద్యార్థులు



బుధవారం హాజరైన 8 మంది విద్యార్థులు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మీదేవమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులే అభ్యసిస్తున్నారు. వీరిలో బుధవారం 8 మంది హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు 'న్యూస్‌టుడే' పాఠశాలను సందర్శించగా రెగ్యులర్ ఉపాధ్యాయుడికి బదులు చాకల్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రమేశ్ విధుల్లో ఉన్నారు. వివరాలు ఆరా తీయగా.. రెగ్యులర్ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ బదిలీ అయ్యారని, ఆయన స్థానంలో కర్ణమయ్యకుంట తండాకు చెందిన ఓ ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై నియమించారని తెలిపారు. బుధవారం ఆయన సెలవులో ఉండటంతో తనను ఒకరోజు కోసం పాఠశాలకు పంపించారని పేర్కొన్నారు. గతంలో 30 మంది వరకు విద్యార్థులుండే ఈ పాఠశాలలో ప్రసుత విద్యాసంవత్సరం కేవలం 12 మందికే పరిమితమయ్యారు. ఈ విషయమై మండల విద్యాధికారి శ్రీనివాసగౌడ్‌ను ప్రశ్నించగా తల్లిదండ్రులు పిల్లలను ఆంగ్ల మాధ్యమం కోసం పట్టణాలకు పంపడం వలన విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని, వారి సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

'పాలమూరు కరవుకు కాంగ్రెస్ పార్టీయే కారణం'

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఉమ్మడి పాలమూరును పడావు పెట్టిందే కాంగ్రెస్ పార్టీనని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలమూరులోని ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి ఆంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసిందని పేర్కొన్నారు. పదేళ్లలో కేసీఆర్ తలపెట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులపై వందల కేసులు వేయించి అడ్డుకున్న పాపం ఆ పార్టీదేనన్నారు. కృష్ణా నది నుంచి రోజూ 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు సముద్రం పాలవుతున్నా రిజర్వాయర్లు నింపుకోలేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చేతకాని తనమన్నారు. జూరాలపై భారం పడొద్దనే శ్రీశైలం బ్యాక్ వాటర్ కింద కేసీఆర్ 'పాలమూరు-రంగారెడ్డి' మొదలు పెట్టారని గుర్తు చేశారు. మంత్రుల పర్యటనతో పాలమూరుకు ఒరిగేదేమీ లేదని, ఇక్కడి రైతులకు మేలు చేయాలన్న ప్రణాళిక, చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు. భారాసకు భయపడి మంత్రులు హడావిడిగా ప్రాజెక్టుల పర్యటనలు పెట్టుకున్నారని విమర్శించారు.

విద్యార్థులకు ఆరోగ్య ప్రశస్త్

పిల్లల్లో శారీరక, మానసిక లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్



తుమ్మిళ్ల పాఠశాలలో ట్యాబ్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: పాఠశాలలకు వస్తున్న విద్యార్థుల్లో చాలా మంది శారీరక, మానసిక వికలత్వంతో పాటు, కొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. ఇలాంటి వారికి సంబంధించి ప్రభుత్వం వివరాలు సేకరించనుంది. ఈ మేరకు ఎన్‌సీఈఆర్టీ ప్రత్యేకంగా ప్రశస్త్ పేరుతో యాప్‌ను రూపొందించింది. ఉపాధ్యాయులే విద్యార్థులను పరిశీలించి వారికి సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంది. ఇలా నమోదు చేసిన వారిలో సమస్య లుంటే పిల్లలకు ఉన్నత స్థాయి వైద్యం అందేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగానే 25, 26, 27 తేదీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు ఆర్పీలు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన వారంతా వారి పాఠశాలల్లోని పిల్లల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో : అయిదు జిల్లాల పరిధిలో మొత్తం 3,227 ప్రభుత్వ పాఠశాలలుండగా, 1,200కి పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 5.20 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరి వివరాలు ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, పేరు, సర్వీసు నంబర్, మెయిల్ ఐడీ, చరవాణి, యూడైస్ కోడ్‌తో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. తరువాత అందులో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

రెండు భాగాలుగా : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయ్యాక ఈ కార్యక్రమం అమలు కానుంది. దీనిని రెండు భాగాలుగా విభజించారు. ప్రశస్త్ యాప్‌లో పొందుపరిచిన విధంగా ఉపాధ్యాయులు కొన్ని ప్రశ్నలను పిల్లలను అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. మరికొన్ని వారే నిశితంగా పరిశీలించి నమోదు చేయాల్సి ఉంటుంది.

● పార్ట్-1 కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబరు 26 వరకు చేపట్టాలి. ఈ సమయంలో యాప్‌లో ఉన్న 64 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపరచాల్సి ఉంటుంది. బోధన సమయంలో ఆ విద్యార్థి సరిగా చూస్తున్నాడా? గమనిస్తున్నాడా? చదువుతున్నా? అవయవలోపం, వినికిడి లోపం, మాటలో తడబాటు, మానసిక వైకల్యం ఇలాంటివి గమనించి నమోదు చేయాలి.

● పార్ట్- 2 కార్యక్రమాన్ని అక్టోబరు 27 నుంచి నవంబరు 14 వరకు చేపట్టాల్సి ఉంటుంది. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని పరిశీలిస్తారు. లోపాన్ని గుర్తించి వైద్యులకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది.



ప్రశస్త్ యాప్ ముఖచిత్రం

మెరుగైన వైద్యం అందేలా..

విద్యార్థులకు సంబంధించి శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, అవయవ లోపం ఉన్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. పేదరికంతో తల్లిదండ్రులు వైద్యం చేయించలేని పరిస్థితులు అయిదు జిల్లాలలోని క్షేత్ర స్థాయిలో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే నేరుగా విద్యార్థుల సమస్యలను తెలుసుకొని, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోనుంది.

వంద శాతం నమోదయ్యేలా చూస్తాం



ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వందశాతం నమోదు చేసేలా చూస్తాం. ఇప్పటికే ఈ యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణలు నిర్వహిస్తున్నాం. శిక్షణ ముగిసిన వెంటనే విద్యార్థులందరినీ సూక్ష్మంగా పరిశీలించి వారి లోపాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలు ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు.

-హంపయ్య, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల

భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య



సాయి

కందనూలు, న్యూస్‌టుడే : భార్య వేధింపులు తట్టుకోలేక భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. రెండో ఎస్సై రమాదేవి కథనం ప్రకారం.. పట్టణంలోని నాగనూల్ బీసీ కాలనీకి చెందిన సాయి (21)కి నెల రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన యువతితో వివాహమైంది. ఆమె మొదటి నుంచి భర్తతో సన్నిహితంగా ఉండకుండా తరుచు వేధించింది. వేధింపులు తట్టుకోలేక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం సాయి బావ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

ధరూర్, న్యూస్‌టుడే: కేటిదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై పోక్సో చట్టం కింద బుధవారం కేసు నమోదైంది. డీఎస్పీ సత్యనారాయణ కథనం మేరకు.. ఉమిత్యాల గ్రామానికి చెందిన ఓ బాలిక వారం రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బాలిక మృతికి లైంగిక వేధింపులే కారణమే ఆరోపణలు వచ్చాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేసిన పోలీసులు లైంగిక వేధింపుల వల్లనే ఆమె మృతిచెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. దీంతో అదే గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి, జయచంద్ర, వీరేశ్‌లపై పోక్సో చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి వారిని బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

కందనూలు, న్యూస్‌టుడే : బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన స్నేహితురాలితో కలిసి మే 15న నాగర్‌కర్నూల్ పట్టణంలోని నల్లవెల్లి ప్రధాన రహదారి పక్కన కారులో భోజనం చేస్తుండగా పట్టణంలోని ఠాణాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ట్యాబ్‌లో ఫొటో తీసి బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేశాడు. అదే ఫొటోను బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహించిన రాంచందర్‌కు పంపడంతో అతను కూడా బాధితుడిని బెదిరించాడు. ఈ ఫొటో భార్య, భర్తల మధ్య కలహాలకు కారణమైంది. ఈ ఘటనపై ఈనెల 23న ఆరోపణలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి మంగళవారం జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు పూర్తి నివేదిక అందజేశారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న రాంచందర్, చిన్నను ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ కనకయ్య బుధవారం రాత్రి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో పోలీసు అదృశ్యం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామకృష్ణ ఆర్థిక ఇబ్బందులతో అదృశ్యమయ్యారని వనపర్తి పట్టణ ఎస్సై జయన్న తెలిపారు. వనపర్తి పీర్లగుట్టలోని పోలీస్‌క్వాటర్స్‌లో కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నారని, మంగళవారం సాయంత్రం ఎస్కార్ట్ విధులకు వెళుతున్నానని భార్య మంజుతో చెప్పి ఇంటి నుంచి వెళ్లి పోయారు. బుధవారం ఉదయం ఆమె ద్విచక్ర వాహనంపై ఉన్న భర్త బ్యాగును చూశారు. అందులో ఉన్న చరవాణి తీసి మెసేజ్ చదివారు. 'సారీ.. మంజు క్షమించు శ్రీరంగాపూర్‌లో పని చేస్తున్న రాకేశ్ మోసం చేశాడని, జీవితాంతం ఉద్యోగం చేసిన అప్పులు తీరే పరిస్థితి కనిపించడం లేదని, రుణాలతో సుమారు రూ.కోటికి ష్యూరిటీ ఇచ్చానని, ఈఎంఐ కట్టే పరిస్థితిలో లేనని అందకు వెళ్లిపోతున్నాని సమాచారం ఇచ్చాడని' ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కానిస్టేబుల్ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా బుధవారం తెల్లవారుజామున 3.40 గంటలకు ఆయన హైదరాబాద్ బస్సులో వెళ్లారు. బస్సు చోదకుడిని అడగగా ఎంజీబీఎస్‌లో ఉదయం 6.40 గంటలకు కానిస్టేబుల్ దిగినట్లు తెలిపారని ఎస్సై పేర్కొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

నైపుణ్యాల ప్రదర్శన



వేలి ముద్రలను తనిఖీ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీలు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో 2024 సంవత్సరానికి సంబంధించి శాఖాపరమైన నైపుణ్యాలను బుధవారం ప్రదర్శించారు. దీనికి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ హాజరై పోలీసు ప్రతిభా పాటవాలను అంచనా వేశారు. మహబూబ్‌నగర్ పోలీస్ విధుల నిర్వహణ కార్యశాలను డీఐజీ ప్రారంభించి మాట్లాడారు. వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. ఫోరెన్సిక్ సైన్స్, నేర పరిశోధన, క్రిమినల్ లా, రాత పరీక్ష, మౌఖిక పరీక్ష, చేతి వేలి ముద్రల సేకరణ, నేరం జరిగిన చోట ఫొటోగ్రఫీ తీసే విధానం, సంఘటన స్థలంలో పోలీసుల నేర శోధనతో పాటు వాహనాల తనిఖీలు, క్షేత్రస్థాయిలో పరిశోధన, గదుల్లో పరిశోధన, కంప్యూటర్‌లో సాంకేతిక పరిజ్ఞానం, పోలీసుల జాగిలాలతో నేరస్థుల గుర్తింపు, నేరం చేసిన తర్వాత నిందితుడు వెళ్లే రహదారి గుర్తింపు, తదితర వాటిపై పోటీలు నిర్వహించారు. ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, డీఎస్పీ సుదర్శన్, సీఐ రాజేందర్ పాల్గొన్నారు.

కొత్త పద్ధతులతో బోధించండి



మాట్లాడుతున్న పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి

పాలమూరు, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు కూడా తమ బోధన పద్ధతులను మార్చుకోవాలని, కొత్తగా వస్తున్న నూతన పద్ధతులను అందిపుచ్చుకోవాలని పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి సూచించారు. బుధవారం పాలమూరు విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అధ్యాపక బోధన పద్ధతులపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తొలిరోజు గ్రంథాలయ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశానికి రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. బోధనా రంగంలో నిత్యం అనేక రకాల మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటిలో అధ్యాపకులు తగిన శిక్షణ పొందాలన్నారు. వృక్షశాస్త్ర ఆచార్యులు డా.సుధాకర్‌రెడ్డి, ఛైర్మన్ డా.చంద్రకిరణ్, పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్, కన్వీనర్ జిమ్మి కాటన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : మత్తు వదలరా 2
కల్వకుర్తిలో.. పార్థసారథి : ఉత్సవం

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



టమాటా 26, వంకాయ 40, బెండ 40, మిరప 45, కాకర 60, బీర 64, క్యాలీఫ్లవర్ 74, క్యాబేజీ 40, క్యారెట్ 64, దొండ 40, ఆలుగడ్డ 45, ఉల్లిగడ్డ 52, గోకర 64, దోస 40, ఆనంకాయ 16, చిక్కుడు 64, మునగకాయ 74, బీట్‌రూట్ 50, ఖీర, 40, బీన్స్ 90.

- న్యూస్‌టుడే, కందనూలు

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : తమను ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ ప్రమీలకు వీఆర్‌ఏల వారసులు వినతిపత్రం అందజేశారు. 61 సంవత్సరాలు దాటిన వీఆర్‌ఏల వారసులు ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్నారన్నారు. జీవో వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అర్హత కల్గిన 265 మంది మరణించారని, తమకు న్యాయం చేయాలని కోరారు. చిన్నయ్య, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

డీఎస్వో విచారణ

తిమ్మాజిపేట: అధిక నిల్వలతో సీజ్ అయిన మండలంలోని ఆవంచ గ్రామ చౌకధర దుకాణంపై బుధవారం నాగర్‌కర్నూల్ డీఎస్వో శ్రీనివాసులు విచారణ జరిపారు. గ్రామస్థుల ఫిర్యాదుతో జులై 14 తనిఖీలు చేసిన రెవెన్యూ అధికారులు అధిక నిల్వలున్నట్టు గుర్తించి సీజ్‌చేసిన సంగతి విధితమే. ఈ విషయమై గ్రామస్థులతో సమావేశమైన డీఎస్వో సరఫరా తీరు, నిల్వలు, తూకాలపై గ్రామస్థులనడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ రామకృష్ణ, డీటీ అలీబాబా, ఆర్ఐ రవికుమార్‌లున్నారు.

ఠాణా తనిఖీ

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముందుకెళ్లాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం పట్టణంలోని ఠాణాను సందర్శించి దస్త్రాలను పరిశీలించారు. బాధితులతో మర్యాదగా మెలగాలని, పోలీసులపై నమ్మకం కలిగేలా ఉండాలన్నారు. సీఐ రవీందర్, ఎస్సైలు రాము, ఇంద్రసేన, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి



తహసీల్దార్ జయంతికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెంట్లవెల్లి , న్యూస్‌టుడే : మండలంలోని జటప్రోల్, గోప్లాపూర్, ఎంగంపల్లితండా, కొండూర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు భూములు ఇవ్వకుంటే రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎస్ జయంతికి అందించారు. కురుమయ్య, తిమ్మస్వామి, రామచంద్రయ్య, శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణలో బుడగజంగాలకు సముచితస్థానం కల్పించాలి



పెద్దకొత్తపల్లిలో అభివాదం తెలుపుతున్న బుడగజంగాల నాయకులు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి భేడబుడగ జంగాలకు రాజ్యాంగ ఫలాలు దక్కలేదని బుడగ జంగాల హక్కుల పోరాటసమితి వ్యవస్థాపకులు సిరిగిరి మన్నెం, జాతీయ అధ్యక్షులు కోడిగంటి నర్సింహా, రాష్ట్ర అధ్యక్షులు ఎడవల్లి వీరప్ప, ఉపాధ్యక్షులు గడ్డం మల్లికార్జున్, గౌరవాధ్యక్షులు నిదుగొంగ కృష్ణయ్య అన్నారు. మంగళవారం పెద్దకొత్తపల్లిలో భేడబుడగజంగాల సభ నిర్వహించారు. మండల నూతన అధ్యక్షులుగా గడ్డం సుభాష్, ఉపాధ్యక్షులుగా మహేష్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నరహరి, శివలింగం, గడ్డం మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగ విరమణ చేసిన జీహెచ్‌ఎంకు ఎంఈవో బాధ్యతలు'

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉద్యోగ విరమణ చేసిన జీహెచ్‌ఎంకు ఎంఈవోగా అదనపు బాధ్యతలు ఇస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం శోచనీయమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి డా.శ్రీధర్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కోడేరు మండలం ఎత్తం జడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ఎం.నిర్మల ఆగస్టులో ఉద్యోగ విరమణ చేశారు. ఆమె విధుల్లో ఉన్నప్పుడు కోడేరు మండల నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. అధికారులు ఎంఎన్‌వోలను ఎంఈవోలుగా నియమించడంతో ఉద్యోగ విరమణ చేసిన నిర్మలకు ఎంఈవో బాధ్యతలు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ఉత్తర్వులను సవరించి కోడేరు మండలానికి సీనియర్ జీహెచ్‌ఎంకు ఎంఈవో బాధ్యతలు అప్పగించాలని సూచించారు. కొన్ని మండలాల్లో జూనియర్ జీహెచ్‌ఎంలను ఎంఈవోలుగా నియమించినందున వాటిని మార్పు చేసి సీనియర్లకు అవకాశం కల్పించాలని కోరారు.

జలాశయాల నిర్వాసితులకు న్యాయం చేస్తాం

మంత్రులు ఉత్తమ్, జూపల్లి వెల్లడి



అంజనగిరి జలాశయం వద్ద మంత్రులు, అధికారులు

కొల్లాపూర్, కోడేరు, కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల్లో ముంపునకు గురైన నిర్వాసితులకు న్యాయం చేస్తామని తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు రేగుమాన్‌గడ్డ శివారులో జరుగుతున్న ప్రాజెక్టుల పనులను పరిశీలించారు. మంత్రులతో పాటు ఎంపీ మల్లురవి, ప్రణాళికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, పాలమూరు పథకంలోని సమావేశపు హాల్ భవనంలో నిర్వాసితులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని న్యాయం చేస్తామని చెప్పారు. నీళ్ల దుంకే డెలివరీ సిస్టర్న్, జలాశయం, కట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. తర్వాత ఎంజీకేఎల్ఐ లిఫ్ట్ దగ్గర నీళ్ల ఎత్తిపోతను చూశారు. అక్కడి నుంచి రేగుమాన్‌గడ్డ తీరంలో పాలమూరు హెడ్‌రెగ్యులేటరీ, సొరంగం ప్రాంతం సందర్శించారు. ఈ ప్రాంతంలో శ్రీశైలం తిరుగుజలాల నీటి నిల్వను ఆరా తీశారు. ఈఎన్‌సీ అనిల్‌కుమార్, కార్యదర్శి పాటిల్‌ప్రశాంత్‌జీవన్, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు, సీఈ విజయ్‌భాస్కర్‌రెడ్డితో మంత్రులు మాట్లాడి పనుల వివరాలు తెలుసుకున్నారు. పనుల నాణ్యత, పురోగతిపై ఆరా తీశారు. పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టులో కాల్వల్లో సిమెంట్ లైనింగ్ పనులను చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఒకే ప్రాజెక్టు కింద 120, 123 జీవోలు తీసుకువచ్చి అర్హులకు అన్యాయం జరిగిందని భూ నిర్వాసితులు మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కేఎల్ఐతో పాటు పాలమూరు రంగారెడ్డి కేఎల్ఐ, మిషన్ భగీరథ ప్రాజెక్టుల కింద తమ భూములు, ఇళ్లు కోల్పోయామని నిర్వాసితులు మంత్రికి వివరించారు. బోడబండతండా మీదుగా హైపవర్ విద్యుత్‌లైన్ వెళ్లడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామాన్ని పునరావాసం కల్పించి ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణాలలో ప్రధానమైన కాల్వలకు సీసీ లైనింగ్ పనులు లేకపోవడంతో చివరి ఆయకట్టు పొలాలకు సాగు నీరు పారడం లేదన్నారు. ఈ సమస్య నివారణకు సంబంధిత అధికారులు సమన్వయంతో నివేదిక తయారు చేసి పనుల మంజూరుకు నిధుల కేటాయింపు చేపట్టాలన్నారు. ఎంజీకేఎల్ఐ, పాలమూరు ప్రాజెక్టులలో గత ప్రభుత్వంలో నిర్వాసితులకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మానవతా దృక్పథంతో న్యాయం చేస్తామన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకించి కమిటీని ఏర్పాటు చేసి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకారంగా న్యాయం చేస్తామన్నారు. తమకు రెండు జీవోల ప్రకారం పరిహారం ఇవ్వడం వలన నష్టపోయామని మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఎంపీ మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గానికి ప్రాజెక్టు నుంచి సాగు, తాగుకు 2 టీఎంసీలకు సరపడా 2 రిజర్వాయర్లు మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ముఖ్యమంత్రితో మాట్లాడాతమని మంత్రి ఆయనకు హామీ ఇచ్చారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆర్థిక వనరులకు అనుగుణంగా నిధుల కేటాయింపును సరి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో నాగరాజు, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, డీఈలు అమర్‌సింగ్, ప్రవీణ్‌కుమార్, లోకిలాల్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సర్కారు పాఠశాల భవనానికి మరమ్మతులు



కొల్లాపూర్ ఆర్‌ఐడీ పాఠశాల భవనం మరమ్మతు పనులను పరిశీలిస్తున్న పూర్వ విద్యార్థులు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : కొల్లాపూర్‌లో (రాణి ఇందిరా దేవి) ఆర్‌ఐడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో భవన మరమ్మతుల పనులు జరుగుతున్నాయి. ఈ పనులను బుధవారం ఆర్‌ఐడీ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, పూర్వ విద్యార్థులు పరిశీలించారు. 1930లో ఆర్‌ఐడీ పాఠశాల, 1969లో కళాశాల ప్రారంభం కాగా ఈ ఏడాది నవంబర్‌లో 27, 28, 29 తేదీల్లో స్వర్ణోత్సవ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్‌ఐడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో మరమ్మతుల పనులను చేయిస్తున్నట్లు సంఘం నాయకులు విశ్రాంత డీఆర్వో మదన్‌మోహన్‌రావు, అశోక్‌గౌడ్, పూర్వ విద్యార్థులు తదితరులు చెప్పారు. పాఠశాలతో పాటు ఆర్‌ఐడీ కళాశాల పూర్వ విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలు, మేధావులు ఆర్‌ఐడీ పాఠశాల, కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని వారు కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



భాజపా సభ్యత్వ నమోదులో పాల్గొన్న పార్టీ నేతలు

వంగూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం వంగూరులో భాజపా కార్యాలయంలో ఆపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు అమలుకు సాధ్యం కాని హామీలనిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం చేపట్టుతున్న ప్రజారంజాక పథకాలతో పాటు కాంగ్రెస్ అమలు చేయని హామీలపై ప్రజలకు వివరించి చైతన్య వంతులను చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో భాజపా ఎస్సీ మోర్చ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాషా, పార్లమెంట్ కన్వీనర్ రాగి రామకృష్ణరెడ్డి, నాయకులు నాగరాజు, సైదులు, శ్రీనునాయక్, భాస్కర్, సైదులు, మల్లేశ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చౌరవతోనే వన్యప్రాణుల సంరక్షణ

అమ్రాబాద్, న్యూస్‌టుడే : వన్యప్రాణుల సంరక్షణను విద్యార్థులు బాధ్యతగా భావించాలని అటవీ విద్య, ప్రజా సంబంధాల అధికారి జి.శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ అవసరాల కోసం అడవులు, వన్యప్రాణులపై ఆధారపడుతున్నారన్నారు. ఇది అడవులకు, అటవీ జంతువులకు ముప్పుగా మారిందన్నారు. నిత్యజీవితంలో వినయోగించే ప్లాస్టిక్ వన్యప్రాణులకు ప్రాణ సంకటంగా మారుతున్నాయని ప్లాస్టిక్ కవర్లు, సీసాల స్థానంలో నేలలో సులభంగా కరిగే వస్త్ర, జనపనార సంచులను వినియోగించాలని చెప్పారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి ప్లాస్టిక్ సీసాల స్థానంలో మట్టి సీసాలను తయారు చేసి ఉపాధి పొందొచ్చని ప్రధానాచార్యులు మదన్‌మోహన్ తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. జంతు శాస్త్ర విభాగం అధ్యాపకురాలు సుష్మ, సమన్వయకర్తలు గోపాల్, రాధ, చంద్రయ్య, అధ్యాపకులు రమేశ్, శంకరయ్య, ఆంజనేయులు మహేశ్, శ్రీకాంత్, శ్యాం, పాల్గొన్నారు.

శారీరక,మానసిక దృఢత్వం అవసరం

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థికి శారీరక, మానసిక దృఢత్వం ఉంటేనే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని నాగర్‌కర్నూల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పుట్టమౌనిక సూచించారు. బుధవారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో తిమ్మాజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు హాజరై మాట్లాడారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలునాటి ప్రతి విద్యార్థి ప్రతి సంవత్సరం ఒకటిచొప్పున మీఇంట్లో మొక్కలునాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణశెట్టి, న్యాయవాదులు శ్యాంప్రసాద్‌రావు, రాంచందర్, భవాని, శ్రీరాం, రహీం, సిబ్బంది కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పైపులైన్ల నిర్మాణాలు

ప్రజలకు తప్పని తాగునీటి వెతలు



పట్టణంలోని తెలుగువీధిలో రోడ్డు పక్కన పైపులైన్, అవతల ఇళ్ల వైపు కనెక్షన్‌కు తవ్వకం పనులు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : కొల్లాపూర్ పురపాలికలో ఇష్టానుసారంగా పైపులైన్ల నిర్మాణం చేశారు. దీనివలన ప్రజలకు తాగునీటి వెతలు తప్పడం లేదు. పట్టణంతో పాటు విలీన గ్రామాలైన చుక్కాయిపల్లి, తాళ్ల నర్సింహాపురం, నర్సింగరావుపల్లి, చౌటబెట్ల గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం నుంచి ఇంటింటికి తాగునీటి సరఫరా చేయాలి. 2016-17లో రూ.40కోట్లతో నిర్మాణ పనులు చేపట్టినా.. ఇప్పటికీ పూర్తి కాలేదు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వెనకాల తెలుగువీధిలో ఒక వైపు పైపులైన్ నిర్మాణం చేసి మరోవైపు ఇళ్లకు కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో ఇంటింటికి తాగునీటి సరఫరా లేకుండా పోయింది. బుధవారం పైపులైన్ కనెక్షన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇదే పరిస్థితి పట్టణంలోని పలు కాలనీల్లో నెలకొంది. విలీన గ్రామాల్లో పైపులైన్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. గతంలో ఉన్న బావులు, బోర్లకు ఉన్న పైపులైన్లకే భగీరథ తాగునీటి కనెక్షన్ ఇవ్వడం వలన నీటి సమస్య ఏర్పడుతోంది. వాస్తవానికి పురపాలిక ప్రజలకు రోజు 52 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 30 లక్షలకు పైగా లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో శివారు గ్రామాలు, కాలనీల్లోని ప్రజలకు తాగునీరు అందడం లేదు.

- పైపులైన్ పనులు 2018-19 డిసెంబర్‌నాటికి పూర్తి చేయాల్సి ఉంది. గడువు దాటిపోయిన ఇంకా పనుల పూర్తి లేకుండా పోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా లీకేజీలు అరికట్టి లక్ష్యం మేర ఇంటింటికి తాగునీరు అందించాలని కోరుతున్నారు. ఈ సమస్యపై పురపాలిక ఛైర్‌పర్సన్ మేకల రమ్య కుమారి స్పందిస్తూ ప్రస్తుతం పైపులైన్ల పనులు పూర్తి చేయించి ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

చెంచులకు ప్రత్యేక ఆధార్ నమోదు

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా చెంచులకు ఆధార్ కార్డు నమోదు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు లేక చెంచులు ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నారన్నారు. ఇందుకోసం మన్ననూరు రైతు వేదికలో గురువారం నుంచి ఆర్డీవో పర్యవేక్షణలో చెంచులకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు లేని చెంచులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉపాధి కూలీలకు వైద్య పరీక్షలు



కూలీలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి మంజుభార్గవి

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : చారకొండ ఆసుపత్రిలో స్వచ్ఛత హీ సేవలో భాగంగా బుధవారం ఉపాధి హామీ పథకం కూలీలకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్యాధికారిణి మంజుభార్గవి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కూలీలకు, సిబ్బందికి రక్త పరీక్షలతో పాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమగు మందులను ఉచితంగా అందజేశారు. గ్రామంలోని పలు వీధుల్లో చెత్త చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించి, కాల్వల్లో మురుగు తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, ఎంపీవో వెంకటేశ్, కార్యదర్శి గణేశ్, సిబ్బంది శేఖర్‌రెడ్డి, ఎన్ డీవీచారి, వాణిశ్రీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బల్మూర్ ప్రాజెక్టు సీడీపీవో దమయంతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పోషణామాసం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు పండ్లు, పాలు, ఆకుకూరల వంటి బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. పౌష్టికాహారం తీసుకోకపోతే పిల్లలు లోపాలతో పుడుతారన్నారు. ఆహారం విషయంతో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వెల్‌బేబీ షో నిర్వహించి పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.స్వప్న, ఎంపీడీవో మోహన్‌లాల్, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు బీపాష, ఆరోగ్య పర్యవేక్షకులు ప్రభావతి, అంగన్‌వాడీ పోషన్ అభియాన్ సమన్వయకర్త పార్వతి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హమాలీలకు పింఛన్ ఇవ్వాలి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : హమాలీ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే పింఛన్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. కల్వకోలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 50 సంవత్సరాలు పైబడిన హమాలీలకు ప్రతినెలా రూ.15వేల పింఛన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, వెంకటస్వామి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

స్పందనకు వందనం

వెల్దండ (గ్రామీణం), న్యూస్‌టుడే : మండల కేంద్రమైన వెల్దండ-చారకొండ ప్రధాన రహదారిపై అధ్వానంగా మారిన రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. 'ఈనాడు'లో ఈనెల 23న మరమ్మతులు మిన్నకుండి! శీర్షికన ప్రచురితమైన కథనానికి ఓ గుత్తేదారు సంస్థ నిర్వాహకులు స్పందించారు. తారు రహదారిపై ఉన్న మట్టిని తొలగించి కంకరతో పాటు రాతి పిండిని కలిపి గుంతలపై పోసి చదును చేశారు. ఆర్ అండ్ బీ మరింత రహదారి తాత్కాలికంగా మెరుగుపడటంతో విద్యార్థులు, రైతులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటరు జాబితాను సరి చేయాలని వినతి

చారకొండ (వెల్దండ (గ్రామీణం)), న్యూస్‌టుడే : చారకొండ మండలం జూపల్లి గ్రామంలో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టాలని పలువురు ప్రవీణ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. [illegible] కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు వార్డుల్లో ఉన్నారని, రెండేసి ఓట్లు, చనిపోయిన వారికి ఓటు హక్కు ఉందని.. వాటన్నింటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. యువకులు మల్లేశ్‌యాదవ్, శ్రీను, కృష్ణయ్య, వి.శ్రీను పాల్గొన్నారు.

సగరులు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతు జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడు భీమయ్య

కల్వకుర్తి, న్యూస్‌టుడే : సగరులు రాజకీయంగా ఎదగినప్పుడే అన్ని రంగాల్లో న్యాయం జరగనుందని జిల్లా సగర సంఘం గౌరవ అధ్యక్షుడు భీమయ్య అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో సగర యువజన రాజకీయ చైతన్య సదస్సు రాష్ట్ర కార్యదర్శి వివేకానంద ఆధ్వర్యంలో జరిగింది. సగరులు గృహనిర్మాణ రంగానికే పరిమితం కావొద్దని, విద్యలో రాణిస్తూ రాజకీయంగా ఎదగటానికి అడుగులు వేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సగరులు సత్తాచాటాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర సంఘం ప్రతినిధులు రాజు, ఆంజనేయులు, వెంకటయ్య, జిల్లా నాయకులు వేణు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడు

కందనూలు, న్యూస్‌టుడే : కందనూలు కళాసేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆ సంఘం భవనంలో గాయకుడు బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి సీతారాం పాల్గొని మాట్లాడారు. వేలాది పాటలు పాడి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి మురళీధర్‌రావు పాల్గొన్నారు.

చెంచులు పండ్లతోటలు సాగు చేయాలి

అమ్రాబాద్, న్యూస్‌టుడే : చెంచులు ఉపాధి హామీ పథకం ద్వార పండ్ల తోటలు పెంచుకుని లబ్ధి పొందాలని ఉపాధి హామి పథకం చెంచు ప్రత్యేకాధికారి మల్లేశ్ తెలిపారు. బుధవారం మండలంలోని జంగంరెడ్డిపల్లెలో చెంచులు సాగు చేస్తున్న పండ్ల తోటలను పరిశీలించారు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా సాయం చేస్తోందన్నారు. మండలంలోని చెంచులు పండ్ల తోటల పెంపకంతో లబ్ధి పొందాలని సూచించారు. పంట చేతికొచ్చే వరకు అంతర పంటలు సాగు చేసుకోవచ్చని చెప్పారు. చెంచులందరు వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఆర్ఓఆర్ పట్టాలున్న చెంచులకు 150 రోజుల పనిదినాలను ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి పథకం టీఏలు ఆంజనేయులు, వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై విచారణ

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్) : మండలంలోని చెన్నారంలో శిలాఫలకం ధ్వంసమైన ఘటనలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. 2023 సెప్టెంబరు 11న దుకాణ సముదాయం, శుద్ధ జలకేంద్రం పనులకు శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఈనెల 23న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని ధ్వంసం చేశారు. స్థానికుల సమాచారంతో బుధవారం పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టినట్లు ఎస్సై చెప్పారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

వెల్దండ, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా చేపడుతూ, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం వెల్దండ మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీధుల్లో మురుగు నిల్వ ఉండకుండా, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. అక్టోబరు2న గాంధీ జయంతి రోజున ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి గ్రామాభివృద్ధి వార్షిక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో ఈశ్వర్‌జీ, ఉపాధిహామీ సాంకేతిక సలహాదారులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి

అమ్రాబాద్, న్యూస్‌టుడే : పైప్‌లైన్ల లీకేజీలను ఎప్పటికపుడు సరిచేస్తూ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహనరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అమ్రాబాద్, పదర మండలాల మిషన్ భగీరథ సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణకు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటప్రసాద్, ఎంపీడీవో వెంకటయ్య, ఏఈ సందీప్, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో మహిళ మృతి

భూత్పూర్, న్యూస్‌టుడే : భూత్పూర్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రహదారి ప్రమాదంలో మహిళ మృతిచెందారు. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం మాసుపల్లికి చెందిన లక్ష్మి(29) కొంతకాలం నుంచి పుట్టింట్లో ఉంటోంది. మూడు రోజుల కిందట ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికారు. భూత్పూర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందినట్లు సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వాగులో మునిగి మేకలు మృతి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వెన్నచర్ల పెద్దచెరువు వాగు ఉధృతికి గ్రామానికి చెందిన దేవరపాగ లక్ష్మికాంతంకు చెందిన రెండు మేకలు వాగునీటిలోకొట్టుకుపోయాయి. దీంతో రూ.30వేలు మేర ఆస్థినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని మంగళవారం అధికారులను కోరారు.

నగదు, నగలతో యువతి అదృశ్యం

కందనూలు, న్యూస్‌టుడే : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతికి ఇష్టం లేని పెళ్లి చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న మిషతో బుధవారం ఇంట్లో నుంచి వెళ్లింది. తల్లిదండ్రులు లేని సమయంలో రూ.7 లక్షల నగదు, 28 తులాల బంగారు ఆభరణాలు వెంట తీసుకెళ్లింది. తల్లిదండ్రులు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్దన్ తెలిపారు.

వేధింపులపై ఫిర్యాదు

కందనూలు, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దముద్దునూర్‌కు చెందిన అధికార పార్టీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ భారాస కార్యకర్త కురుమూర్తి బుధవారం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పట్టణంలోని ఠాణాలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు యువకుని చరవాణి ఆధారంగా మన్ననూర్‌లో ఉన్నట్టు గుర్తించి ఠాణాకు తీసుకొచ్చారు. కురుమూర్తి తమ్ముడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్దన్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

చారకొండ (వెల్దండ (గ్రామీణం), న్యూస్‌టుడే : మర్రిపల్లి గ్రామ సమీపంలోని వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన టిప్పర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి బుధవారం తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గ్రామస్థుల సమాచారంతో పట్టుకొని డ్రైవర్ ముజాహిద్ అలీమ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

కందనూలు, న్యూస్‌టుడే : పురపాలక సంఘం పరిధిలోని ఉయ్యాలవాడకు చెందిన రాములు ఫిబ్రవరి 17న పట్టణంలోని నాగనూల్ చౌరస్తాలో మద్యం తాగి ద్విచక్ర వాహనం నడపటంతో పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. బుధవారం పట్టణంలోని న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా ద్వితీయ శ్రేణి కోర్టు న్యాయమూర్తి వి.రామయ్య విచారించి రూ. 500 జరిమాన, రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై గోవర్దన్ తెలిపారు.

వాగుల ప్రవాహం.. రాకపోకలకు అంతరాయం



నార్లాపూర్ పెద్దవాగు ఉద్ధృతి

కొల్లాపూర్, కల్వకుర్తి, న్యూస్‌టుడే : కురుస్తున్న వర్షాలతో కొల్లాపూర్ నియోజకవర్గంలో వాగులు ప్రవహించాయి. నియోజకవర్గంలో 85.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో నరేందర్ బుధవారం తెలిపారు. అత్యధికంగా పెంట్లవెల్లి మండలంలో 34 మిల్లీమీటర్లు, కొల్లాపూర్‌లో 26, కోడేరు మండలంలో 25.4 మి.మీ వర్షం కురిసిందన్నారు. నల్లమలలోని నార్లాపూర్, ముక్కిడిగుండం గ్రామాల మధ్య పెద్దవాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు వాగు ప్రవాహం వలన నిలిచిపోయాయి. కొల్లాపూర్ పట్టణంలోని మూల వాగు, చౌటబెట్ల, రామాపురం గ్రామాల్లోని వాగులు ప్రవహించాయి. ముక్కిడిగుండంలో దెబ్బతిన్న వరిపంటలను వ్యవసాయశాఖ ఏవో చిన్నహుసేన్ యాదవ్ పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

- కల్వకుర్తి నియోజకవర్గంలోని పది గ్రామాల ప్రజలు కల్వకుర్తికి చేరుకోవాలన్నా.. ఎంగంపల్లి, జిల్లెల గ్రామాల రైతులు పంటపొలాలకు చేరుకోవాలన్నా వాగు దాటాల్సిందే.. వర్షాకాలంలో వాగు దాటాలంటే వరదలో ఇబ్బందులు పడక తప్పటం లేదని వాపోతున్నారు. ఎంగంపల్లి గ్రామ సమీపంలో ఈ వాగు ఉంది. ఎంగంపల్లి- జిల్లెల్ల గ్రామాల మధ్యలో రోడ్డులోని వాగుపై వంతెన ఏర్పాటు చేయకుండా కాజ్‌వేతో సరిపెట్టారు. కొద్ది పాటి వర్షం వచ్చినా.. వరద పారుతూనే ఉంటుంది. తలకొండపల్లి, ఊర్కొండ మండలాల పరిధిలోని పది గ్రామాల ప్రజలు, కల్వకుర్తి పట్టణానికి చేరుకోవటానికి ఈ రోడ్డు అనుకూలం. నిత్యం వందలాది ద్విచక్ర, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రాత్రి సమయంలో రైతులు పంట పొలాలకు వెళ్లటానికి తిప్పలు పడక తప్పటం లేదంటున్నారు. కాజువే మధ్యలో గుంతలుండటంతో కొత్తవారు అందులోకి వచ్చి కింద పడిన సందర్భాలున్నాయి. వంతెన ఏర్పాటుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని పంచాయతీరాజ్ శాఖ డీఈఈ దుర్గాప్రసాద్ తెలిపారు.



ఎంగంపల్లి వాగు వద్ద ప్రయాణికుల ఇబ్బందులు